ప్రజాశక్తి

గురువారం 21 సెప్టెంబర్ 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



మీడియాతో మాట్లాడుతున్న ఎపిఆర్ఎస్ఎ జిల్లా నాయకులు

తహశీల్దార్‌పై దాడి చేసిన

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- నాన్ బెయిల్ సెక్షన్లు పెట్టి అరెస్టు చేయాలి
- ఎపిఆర్ఎస్ఎ జిల్లా నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తహశీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న అధికారిపై భౌతికదాడి చేసిన నిందితుడిని నాన్ బెయిలబుల్ సెక్షన్లు పెట్టి అరెస్ట్ చేయాలని ఎపిఆర్ఎస్ఎ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. సంతనూతల పాడు తహశీల్దార్ లక్ష్మినారాయణరెడ్డిపై భౌతిక దాడి చేసిన నిందితుడిని అరెస్ట్ చేయాలని కోరుతూ ఎపిఆర్ఎస్ఎ నాయకులు కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని కలెక్టర్‌కి అందజేశారు. అనం తరం పాత్రికేయులతో ఎపిఆర్ఎస్ఎ జిల్లా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలను సకాలంలో సజావుగా అమలయ్యేలా మరియు ప్రతి లబ్దిదారునికి పారదర్శకంగా అందేలా రెవెన్యూ అధికారులు పనిచేస్తున్నారన్నారు. ▶ 2లో

సంతనూతలపాడు ఆర్ఐ సస్పెన్షన్

సంతనూతలపాడు ఆర్ఐ కె.వి.ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సంతనూతలపాడు తహశీల్దార్‌పై ఓ వైసిపి నేత దాడి చేసి నేపథ్యంలో కలెక్టర్ సంతనూతలపాడులోని రెవెన్యూ అధికారుల విధులపై పూర్తిస్థాయిలో ఆరా తీశారు. ఆర్ఐ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నట్లు గుర్తించి.. ఆయనను సస్పెండ్ చేశారు.

జిల్లా సమస్యలపై

పాలకపక్షం గళం విప్పేనా.?

- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- చంద్రబాబు అరెస్టుపై ఆందోళనే టిడిపి ఎమ్మెల్యేల ఎజెండా
- వెలిగొండకు నిధుల కేటాయింపే కీలకం



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాజకీయ పరిస్థితులు వాడివేడిగానూ.. ఉత్కంఠగానూ ఉన్న తరుణంలో గురువారం నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. అసెంబ్లీకి వెళ్లేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సిద్ధమయ్యారు. ఎవరి ఎజెండా ఏమిటో నిర్ధారించుకున్నారు. ప్రధానంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ముగ్గురు తెలుగు దేశం ఎమ్మెల్యేలున్నారు. ఇప్పుడు వీళ్లే పార్టీకి కీలకంగా ఉన్నారు. మిగతా వాళ్లంతా పాలక పక్షానికి చెందినవారే.. అసెంబ్లీ సమావేశాల్లో ప్రధానంగా తెలుగుదేశం ఎమ్మెల్యేలు జనం సమస్యలతో పాటు తమ నేత చంద్రబాబు అరెస్టుపై నిలదీయాలని, ఆందోళన చేపట్టాలని నిర్ణయించుకున్నారు. ఇదేవారికి ప్రధాన ఎజెండాగా మారే అవకాశం ఉంది. సభలో తమ నేత అక్రమ అరెస్టుపై ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వాన్ని నిలదీసే వ్యూహంలో ఉన్నారు.

అరెస్టు తర్వాత తెలుగుదేశం చేపట్టిన ఆందోళనలు, ప్రజల నుంచి ఎదురైన నిరసనలు, గవర్నర్ అనుమతి లేకుండా అరెస్టుతో పాటు స్కిల్ డవలప్‌మెంటు కేసులో ఆరోపణలన్నీ అవాస్తవాలంటూ తెలుగుదేశం నేతలు చెబుతున్నారు. వీటిపైనే సభలోనూ ప్రభుత్వాన్ని నిలదీయాలనే ఆలోచనలో ఉన్నారు. ఇందుకోసం కొండపి ఎమ్మెల్యే వీరాంజనేయస్వామితో పాటు అద్దంకి, పర్చూరు ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సిద్ధమవుతున్నారు. తొలిరోజున చంద్రబాబు అరెస్టుపైనే తెలుగుదేశం ఎమ్మెల్యేలు చేపట్టే ఆందోళనే కీలకంగా మారే అవకాశం ఉంది. ఇక ఇతర అంశాలకు వస్తే పాలకపక్ష ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో సమస్యలపై ఏమాత్రం స్పందిస్తారనేదీ చూడాలి. ఇటీవలే నియోజకవర్గ సమీక్షల్లో ఎమ్మెల్యేలపై మండల స్థాయి నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎవరికి టిక్కెట్టు వస్తుందో కూడా తెలియని దైన్యం కొనసాగుతోంది. ఈ తరుణంలో సభలో సమస్యలపై గళం విప్పడానికి, జనం తరపున నిలబడేందుకు ఎంత మంది అనేదీ చూడాలి. ఈ ఏడాదికి ఇవే చివరి సమావేశాలు కావొచ్చు. వచ్చే ఏడాదీ ఎన్నికలు జరుగుతాయి. ఇంకా నిధుల్లేక చాలా పనులు పెండింగులోనే ఉన్నాయి. వాటి కోసం ఎమ్మెల్యేలు సభలో గళం విప్పాల్సి ఉంది. జిల్లాలో తాగు నీటిని సరఫరా చేసిన రవాణా కాంట్రాక్టర్లకు బిల్లులు రూ.150 కోట్లకు పైగా చెల్లించాలి. వీళ్లంతా ఎమ్మెల్యేలను నమ్ముకునే నీళ్లు తోలారు. రోడ్లెక్కారు. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆందోళనలు చేపట్టారు. వీరంతా పాలక పక్షానికి చెందినవారే.. వీటితో పాటు సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు నిర్మించారు. వారికి కూడా బిల్లులు ▶ 2లో

జిల్లా వెనుకబాటుతనానికి..

పాలకుల నిర్లక్ష్యమే కారణం

- ప్రజలకు తాగునీరు, సాగునీరు అందేలా ఉద్యమం
- పెరిదేపి బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య
- సంతనూతలపాడు నియోజకవర్గానికి చేరిన పాదయాత్ర



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్రా మాల్యాద్రి

ప్రజాశక్తి-కొండపి

కేంద్ర, రాష్ట్ర పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రకాశం జిల్లా చాలా దుర్భిక్షంగా మారిందని, వెనుకబడిన ప్రకాశం జిల్లాను గుర్తించి రూ.10 వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని పెరిదేపిలో సిపిఎం పాదయాత్ర బృందానికి ఘనస్వాగతం పలికారు. పెరిదేపి గ్రామంలో ప్రతి వీధిలోకి ఎడ్లబండి ప్రదర్శనతో, కోలాట ప్రదర్శనతో పాదయాత్ర జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కెజి.మస్తాన్ అధ్యక్షతన పెరిదేపిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో వి.కృష్ణయ్య మాట్లాడారు. ఆర్‌బిఐ చెప్పిన లెక్కల ప్రకారం కార్పొరేట్లకు రూ.15 లక్షల కోట్లకు పైగా పన్నుల భారాలు రద్దు చేయడం జరిగిందన్నారు. మన పక్కన గల దేశం చైనా మనకంటే వెనుక ఏర్పడి భారతదేశం కంటే అభివృద్ధిలో ముందుందని చెప్పారు. చైనాలో పది వేల మండల కేంద్రాలను గుర్తించి.. మండల కేంద్రం ఆధారంగా సినిమా హాల్లు, కాలేజీలు, ఆసుపత్రులు తదితర సౌకర్యాలు కల్పిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధిని విస్మరించినంత కాలంగా దుర్భిక్షంగానే జిల్లాలు మిగిలిపోతాయని అన్నారు. జిల్లా వెనుకబాటుతనానికి కారణమైన పాలకులను ▶ 2లో



సంతనూతలపాడు మండలానికి చేరుకున్న సిపిఎం పోరుబాట పాదయాత్ర

గణేష్ నిమజ్జన ప్రాంతాల్లో

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

కొత్తపట్నం తీర ప్రాంతంలో ఎస్పి పరిశీలన ▶ మెయిన్ 5లో

'ఆరోగ్య సురక్ష'ను

విజయవంతంగా నిర్వహించాలి

కలెక్టర్ రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం పిట్టలవాని పాలెం మండల కేంద్రంలోని టి.టి.డి కల్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 30వ తేదీ నుండి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో ఇంటి ఇంటికి వెళ్లి ఆరోగ్య కార్యకర్తలు సర్వే చేయడం జరిగిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో నిపుణులైన వైద్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎక్కువగా గహాలకు, భూములకు సంబంధించిన సమస్యలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.వి.ఎస్.ఎన్.మూర్తి, సి.పి.ఓ భరత్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ ప్రసాద్, వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంత రావు, మత్స్యశాఖ జె.డి సురేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యమే కారణం

తహశీల్దార్‌పై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రమైన మాన సిక ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్న తహశీ ల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న అధికారిపై మంగళవారం జరిగిన భౌతిక దాడిపై రాష్ట్రంలోని ప్రతి ఒక్క రెవెన్యూ ఉద్యోగీ కలత చెందారని, ఈ ఘటన తీవ్ర మనస్తాపం కలిగించిందన్నారు. సంతనూతల పాడు తహశీల్దార్‌పై జరిగిన భౌతిక దాడిని ఎపిఆర్ఎస్ఎ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. విధి నిర్వహణలో ఉన్న తహశీల్దార్‌పై చేయి చేసుకుని బెదిరించిన వ్యక్తిపై తక్షణమే నాన్ బెయిలబుల్ సెక్షన్లు పెట్టి అరెస్ట్ చేయాల న్నారు. ఇప్పటికే తీవ్రమైన పని ఒత్తిడితో సతమతమవుతూ పగలు, రాత్రి తేడా లేకుండా శ్రమిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు ఇటువంటి దాడులతో భయభ్రాంతులకు గురై ప్రజలకు సకాలంలో అందాల్సిన పనులు కుంటుపడే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకుని రెవెన్యూ ఉద్యోగులకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌విఎస్ కృష్ణమోహన్, పి.మధుసూదనరావు, ఎపిఆర్ఎస్ఎ ఒంగోలు కలెక్టరేట్ అధ్యక్షులు ఊతకోలు శ్రీనివాసరావు, జె.డానియేల్, శ్రవణ్, పసుపులేటి మురళి, 80 మందికి పైగా రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

రాబోయే రోజుల్లో నిలదీస్తూ.. నిలేస్తూ ప్రజల చైతన్య వంతంగా ఉద్యమించాలన్నారు. ముసి, అల్లేరు, వెలిగొండ, సంగమేశ్వరం ప్రాజెక్టుల నుండి రైతులకు సాగునీరు ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకునేలా సిపిఎం పోరుబాట పాదయాత్ర బృందం ఉద్యమిస్తోందన్నారు. రాష్ట్రంలో నదుల నుండి 1000 టిఎంసీలు, గోదావరి నుండి 300 టిఎంసీలు , కృష్ణానది నుండి 5 లక్షల టిఎంసీలు నీళ్లు వృథాగా సముద్రంలోకి పోతున్నాయని, ఆ నీటిని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఇవ్వగలిగితే రాష్ట్రంలోని ప్రజలు సాగునీరు, తాగునీరు సమస్యలు లేకుండా సంతోషంగా ఉంటారని తెలిపారు. ఈ పోరుబాట పాదయాత్ర బృందం దృష్టికి వచ్చిన సమస్యలతో పాటు ప్రజల అభివృద్ధిని కోరుతూ సిపిఎం చేపట్టే పోరాట కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు.

నిరుద్యోగులను విస్మరించిన కేంద్రం

కేంద్రంలో మోడీ అధికారంలోకి రాక ముందు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు పూర్తయినా ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టి నిరుద్యోగుల్ని చేసిన పరిస్థితి ఉందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్రా మాల్యాద్రి తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకి అమ్మేస్తున్నారని, ఆంధ్రలోని విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు.

తీవ్ర సంక్షోభంలో వ్యవసాయం

పాదయాత్ర గ్రామాల్లో పర్యటిస్తుంటే అనేక సమస్యలు వెలుగుచూశాయని, గ్రామాలలో వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలోకి పోయినందువల్ల రైతులు సైతం బతుకుతెరువుకు వలసలు పోయే పరిస్థితి నెలకొందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి తెలిపారు. ప్రకాశం జిల్లా వెనుకబాటుతనాన్ని ప్రభుత్వానికి గుర్తు చేయడానికే పాదయాత్ర చేస్తున్నామన్నారు. జిల్లాలో సాగునీటి పథకాలు ఉన్నా పనిలో లేకపోవడం వల్ల రైతులు వలసలు పోయే పరిస్థితి ఉందని తెలిపారు. జిల్లాలో ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ అసెంబ్లీలో నోరెత్తి మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు.

పోరాటాల గడ్డ పెరిదేపి..

పోరాట గడ్డ పెరిదేపి అని కామ్రేడ్ ముప్పరాజు శేషయ్య చేసి పోరాటాలు గుర్తుచేసుకుంటూ ఆయన ఆశయాల సాధనతో ముందుకు పోతున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అన్నారు. గత పది రోజులుగా ప్రకాశం జిల్లా వెనుకబాటుతనాన్ని ప్రశ్నిస్తూ వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని పాదయాత్ర బృందం కాళ్లకు బొబ్బలు పడిన కాళ్లు వాచిన నడుచుకుంటూ పెరిదేపి గ్రామానికి వచ్చేసరికి ఇక్కడ ప్రజానీకం చూపిన ఆదరణకు అవన్నీ మరిచిపోయామని తెలిపారు. ప్రజల్ని చైతన్యం చేయటంతో పాటు పోరాటాలకు సన్నద్ధం చేయటమే తమ పాదయాత్ర ఉద్దేశ్యమన్నారు. పాదయాత్ర బృందంలో వి.బాలకోటయ్య, బి.రఘురాం, కె.రమాదేవి, పి.కల్పన, కె.మాల్యాద్రి, సిహెచ్ వినోద్, వి.ఆంజనేయులు, డికెయం రఫీ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డి హనీఫ్, సిపిఎం జిల్లా నాయకులు ఎం.రమేష్, కాలం సుబ్బారావు, టి.తిరుపతయ్య పాల్గొన్నారు. అనంతరం భగత్‌సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పాదయాత్ర బృందాన్ని శాలువాలతో సత్కరించారు.

సంతనూతలపాడుకు చేరిన పాదయాత్ర

సిపిఎం పోరుబాట పాదయాత్ర బుధవారం కొండపి నియోజకవర్గం నుంచి సంతనూతలపాడు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. సంతనూతలపాడు మండలంలోని మద్దులూరు, మాచవరం, చిలకపాడు, తక్కెళ్లపాడు, గంగవరం గ్రామాలలో పాదయాత్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యల్ని పాదయాత్ర బందం దష్టికి తీసుకొచ్చారు.

పాలకపక్షం గళం విప్పేనా.?

(మొదటిపేజీ తరువాయి)

రాలేదు. పది శాతమే పూర్తయ్యాయి. మిగతావన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. ఆ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. అన్నిటికన్నా వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు ఇవ్వడం అత్యంత కీలకం. ఎందుకంటే ఈ ప్రాజెక్టును వచ్చే నెలలో ప్రారంభించాల్సి ఉంది. దీనికి నిధులు ఇచ్చే విషయంపై అసెంబ్లీలో స్పష్టత వస్తుందా? లేదా? అనేదీ చూడాలి. మంత్రి ఆదిమూలపు సురేష్‌తో పాటు పశ్చిమాన ఉన్న ఎమ్మెల్యేలు వెలిగొండ నిర్వాసితులపై స్పందించాలి. వారికి ఇవ్వాల్సిన ప్యాకేజీలు, నిధులపై దృష్టి సారించాలి. ఇంకా గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల మరమ్మతులకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీని పనులు సాగడం లేదు. ఏడాది సాగర్ నీరు రావడం లేదు. మాగాణి పంటకు విరామం ప్రకటించారు. ఖరీఫ్ పంటలు 40 శాతం కూడా సాగు కాలేదు. ప్రత్యామ్నాయ పంటలు ఏమిటనేదీ స్పష్టత లేదు. వ్యవసాయంపై మాట్లాడాల్సిన అవసరం ఉంది. నోరు విప్పుతారా? లేదా? అనేదీ చూడాలి. ఎందుకంటే తెలుగుదేశం ఎమ్మెల్యేలు చంద్రబాబుపై ఆందోళనలకే పరిమితమయ్యే అవకాశం ఉంది. దానితోనే వారిపై చర్యలు తీసుకోవడం వంటివి జరిగే అవకాశం ఉంది. గళం విప్పాల్సింది పాలకపక్ష ఎమ్మెల్యేలే.. వీటితో పాటు వివిధ వర్గాలు తమ సమస్యలపై అసెంబ్లీకి చలో పిలుపులు ఇస్తున్నారు. అంగన్‌వాడీలు చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. ఉద్యోగ, కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కానందున వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారు. తమకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని వాపోతున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వీరి సమస్యలపై గళం విప్పాల్సి ఉంది.

చింతమల్లపాడులో రేషన్ పంపిణీ

ప్రజాశక్తి-అర్ధవీడు

మూడు నెలలుగా రేషన్ అందటం లేదని మండలంలోని అయ్యవారిపల్లి పంచాయతీలోని చింతమల్లపాడు ఎస్సీ కాలనీవాసులు మంగళవారం ధర్నా చేయడంతో అధికారులు స్పందించారు. మండల రెవెన్యూ అధికారి నాయబ్ రసూల్ ఈ విషయాన్ని సబ్ కలెక్టర్‌తో ప్రస్తావించగా ఆయన సూచనల మేరకు బుధవారం చింతమల్లపాడులో రేషన్ పంపిణీ చేశారు.

దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

అర్హులైన రైతులు మొక్కలు నాటుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ సిహెచ్.రామచంద్రరావు తెలిపారు. ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ వాఖ్యావతి మాట్లాడుతూ ఇప్పటికే పండ్ల తోటలు మంజూరైన రైతులు పనులు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఎలు, ఎఫ్ఎలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సును ఢీకొన్న లారీ..

- యువతి మృతి
- 20 మందికి గాయాలు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

ప్రైవేట్ ట్రావెల్ బస్సును లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువతి మృతి చెందింది. మరో 20 మందికి గాలయ్యాలయి. ఈ ఘటన మండల పరిధిలోని మేడపి వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... అందిన వివరాల ప్రకారం... మార్కాపురానికి చెందిన మానస (22) అనే యువతి విజయవాడలోని ఓ కళాశాలలో చదువుతోంది. విజయవాడ వెళ్లేందుకు మార్కాపురంలో సూపర్ లగ్జరీ బస్సు ఎక్కింది. ఆ బస్సు త్రిపురాంతకం బైపాస్ రోడ్‌లో డివైడర్ పైకి ఎక్కింది. ఆ



మృతి చెందిన మాసన



క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

సమయంలో తటిలో ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న ఎవరికి ఏమి కాలేదు. బస్సు అక్కడే నిలిచి పోయింది. అనంతరం అటువైపుగా వచ్చిన కడప నుంచి విజయవాడ వెళ్తున్న ప్రయివేటు బస్సులో ఎక్కింది. బస్సులో సీట్లు ఖాళీ లేకపోవడంతో డ్రైవర్ సీటు పక్కన కూర్చుంది. బస్సును మేడపి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో మానస అక్కడిక్కడే మృతి చెందింది. మరో 20 మందికి గాయాలయ్యాయి. ఎస్ఐ సుమన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు.

గంజాయి పట్టివేత

- కారు స్వాధీనం - ఇద్దరు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - పంగులూరు

ముందస్తు సమాచారంతో కాపు కాచి, గంజాయి రవాణా చేస్తున్న కారును అందులోని గంజాయి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన బొల్లాపల్లి టోల్ ప్లాజా సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... తుని నుంచి తమిళనాడుకు గంజాయి రవాణా చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బోల్లా పల్లి టోల్ ప్లాజా వద్ద కాపు కాశారు. రాత్రి 8 గంటల సమయంలో గంజాయి రవాణా చేస్తున్న కారు టోల్ ప్లాజా వద్దకు చేరింది. ఇది అదునుగా తీసుకున్న పోలీసులు కారును చుట్టుముట్టారు. గమనించిన డ్రైవరు కారును వేగం ముందుకు కారు నడిపాడు. ముందు ఉన్న మరో కారును ఢీకొంది.మళ్లీ కారును రివర్స్ చేయగా వెనుక వైపు ఉన్న లారీని ఢీకొంది.దీంతో కారు వెనకవైపు దెబ్బతింది. పోలీసులు వెంటనే అప్రమత్తమై కారు అద్దాలు పగలగొట్టి డ్రైవర్‌ను బయటకు లాగారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కారులోని మరో వ్యక్తిని అదపులోకి తీసుకున్నారు. కారు అద్దాలు పగలగొట్టే క్రమంలో మార్టూరు సిఐ ఫిరోజ్ చేతికి గాయమైంది. నిందితులను పోలీసు స్టేషన్ తీసుకెళ్లి విచారిస్తున్నారు. ఈ దాడుల్లో అద్దంకి సిఐ రమేష్, మార్టూరు సిఐ ఫిరోజ్, రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

ఆర్‌టిసి బస్సుఢీకొని విద్యార్థి మృతి

ప్రజాశక్తి-పెద్దారవీడు

ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ఘటనలో ఓ విద్యార్థి అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మద్దలకట్ట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన గాలి సాయి నితీష్‌రెడ్డి (8) అనే బాలుడు మృతి చెందాడు. అందిన వివరాల ప్రకారం... మృతుడు సాయి నితీష్‌రెడ్డి రాజంపల్లి కేంద్ర విద్యాలయంలో చదువుతున్నారు. రోజులాగే పాఠశాలకు వెళ్లాడు. గ్రామంలో వినాయక విగ్రహం నిమజ్జనం ఉండటంతో పాఠశాల నుంచి ముందుగానే ఇంటికి వచ్చాడు. అనంతరం వినాయక విగ్రహం నిమజ్జనం లో పాల్గొన్నాడు. అదే సమయంలో ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. బాలుడు కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు నిరసన తెలిపారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో విఆర్‌ఒ మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ-2 సచివాలటయంలో విఆర్‌ఒగా విధులు నిర్వహిస్తున్న పసుపులేటి కళ్యాణి (27) అనారోగ్యంతో బుధవారం మతి చెందారు. కళ్యాణి చాలా కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధ పడుతుంది. గతేడాది ఆమె తల్లి ఓ కిడ్నీని దానం చేసింది. అనంతరం కళ్యాణి విధులు నిర్వహిస్తుంది. మళ్లీ అనార్యోగ సమస్య రావడంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న తహశీల్దారు సిహెచ్.ఉష, డిప్యూటీ తహశీల్దారు తన్నీరు వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, విఆర్‌ఒల అసోసియేషన్ నాయకులు వెంకటాద్రి తదితరులు కళ్యాణి మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు సానుభూతి తెలిపారు.



కళ్యాణి (ఫైల్)

ఇరిగినేని సేవలు చిరస్మరణీయం : దారపనేని

ప్రజాశక్తి-పామూరు

కనిగిరి నియోజకవర్గ ప్రజలకు దివంగత ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతి నాయుడు అందించిన సేవలు చిరస్మరణీమని కనిగిరి ఎఎంసి మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ తెలిపారు. ఇరిగినేని తిరుపతినాయుడు 85వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రాజకీయాలలో మచ్చలేని నాయకుడిగా కనిగిరి నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాల మన్ననలు పొందిన ఏకైక వ్యక్తి తిరుపతినాయుడు అని తెలిపారు. నివాళులర్పించిన వారిలో తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపిటిసి చెనికల పెదమాల కొండయ్య, సంధి రెడ్డి నారాయణ, నూతంగి నారాయణ, నరసింహారావు, లక్ష్మీనారాయణ, గుర్రం రామ సుబ్బారావు, చెనికల చిన్న మాల కొండయ్య, నాగేశ్వరరావు, దేవరపు మల్లికార్జున చౌదరి, చెనికల మల్లికార్జున, మానం మల్లికార్జున రావు, బొడ్డు సుధాకర్ తదితరులు ఉన్నారు.



వాళులర్పిస్తున్న చంద్రశేఖర్, నాయకులు

మండల పరిధిలోని మోపాడు గ్రామంలోని దివంగత మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతినాయుడు 85వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి నాయుడు సమాధి వద్ద టిడిపి కనిగిరి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, తెలుగు రైతు మండల అధ్యక్షులు మన్నం రమణయ్య నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఎర్రగొర్ల రమేష్, నాయకులు ఓరుగంటి సుబ్బమ్మ. పోక శ్రీనివాసులు, రాయవరపు నరసింహం, పొన్నగంటి మాల్యాద్రి, కొండలరావు, చుంచు రామన్న, గుదే మాలకొండయ్య, గోళ్ళ మహేష్, చావ గురవయ్య, మల్లెల శ్రీనివాసులు, యాదాల కోటయ్య, యాదాల చిన్న, ఒంగోలు ప్రతాప్ తదితరులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ రంగనాథ్

ముందస్తు ప్రణాళికతో దాడి

- నిందితుల్లో ఒకరు అరెస్టు
- మరో వ్యక్తి పరారీ
- వివరాలు వెల్లడించి సిఐ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ బైరాగిమాన్యంలో కుమార్తెను ఈవ్‌టీజింగ్ చేస్తున్న యువకులను మందలించిన తండ్రి సుభానిని హత్య చేసేందుకు నిందితులు ముందస్తు ప్రణాళికతో కత్తులు తీసుకొని వచ్చినట్లు సిఐ దాచేపల్లి రంగనాథ్ ఎస్ఐ టి.శ్రీరామ్ తెలిపారు. బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. నిందితుడు చదలవాడ సదానందం అలియాస్ సదా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మరో నిందితుడు బొజ్జ మహేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులు పక్కా ప్రణాళికతో వచ్చి సుభాని ఇంటి ముందు ఈలలు వేస్తూ అసభ్యకరంగా మాట్లాడినట్లు తెలిపారు. దీంతో సుభాని మందలించినందుకు ఆయన కత్తులతో దాడి చేసినట్లు తెలిపారు. బొజ్జ మహేష్‌ను తర్వలో అరెస్టు చేస్తామని తెలిపారు.

నత్తనడకన భవన నిర్మాణం

- సచివాలయ ఉద్యోగులకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

అధికారులు. పాలకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా సచివాలయ సిబ్బంది విధులు నిర్వహించేందుకు అవస్థలు పడాల్సి వస్తుంది. ఇరుకు గదిలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఇది కోవిలంపాడు సచివాలయ ఉద్యోగుల దుస్థితి. కోవిలంపాడు సచివాలయ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.25 లక్షలు నిధులు మంజూరు చేసింది. 2020 ఫిబ్రవరి 16న భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ శంకుస్థాపన చేశారు. 2019లో టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పుటి ఎమ్మెల్యే కదిరి బాబూరావు రూ.10 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనంపై సచివాలయ భవనం నిర్మించాలని తీర్మానించి పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా నేటికీ భవన నిర్మానం పూర్తి కాలేదు.



నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం

తాత్కాలిక భవనంలోనే పనులు

సచివాలయ భవనం నిర్మాణం పూర్తికాకపోవడంతో గ్రామంలో మూతపడి ఉన్న ఉర్దూ పాఠశాల భవనంలో సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఒకే గదిలో టెబుల్లు, బీరువాలు, కంప్యూటర్లు తదితర ఫర్నిచర్ ఏర్పాటు చేసుకొని తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఒకే గదిలో పదిమంది పైగా సిబ్బంది విధులు నిర్వహించాల్సి రావటంతో సచివాలయ సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. వివిధ పనుల నిమిత్తం ప్రజలు సచివాలయానికి వచ్చినపుడు తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుందని సచివాలయం సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ఇబ్బందులు తీర్చాలని సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ ఎఇ రామకష్ణను వివరణ కోరగా చిన్న, చిన్న పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, అవి కూడా వారం రోజులలో పూర్తి చేసి సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

ఓటర్ల సౌలభ్యం కోసమే

పోలింగ్ కేంద్ర ప్రాంతాల మార్పులు

జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి రంజిత్ బాషా చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక కలెక్టరేట్లో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్ల సౌలభ్యం కోసం పోలింగ్ కేంద్రాల ప్రాంతాలను మార్పు చేయడానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ప్రాథమికంగా మండల, నియోజకవర్గ స్థాయిలో ఎన్నికల అధికారులు ప్రతిపాదించిన అంశాలపై రాజకీయ పార్టీల నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు. పోలింగ్ కేంద్రాలు మార్పు చేస్తూ ఫార్మేట్ ఒకటిలో పొందుపరుస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల పేర్లను మార్పు చేసినవి ఫార్మేట్–2లో, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వివరాలను ఫార్మేట్–3లో పొందుపరుస్తామన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కు సులభతరంగా వినియోగించుకోడానికి వీలుగా కేవలం రెండు కిలోమీటర్ల పరిధిలోనే పోలింగ్ కేంద్రాలు ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి అధికారులు పనిచేస్తున్నారని వివరించారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ప్రస్తుతం 157 పోలింగ్ కేంద్రాలు కొనసాగుతున్నాయని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. ఒకే ప్రాంతంలో శిథిలమైన భవనాల నుంచి పక్కనే ఉన్న మరొక భవనంలోకి 43 పోలింగ్ కేంద్రాలను మార్పు చేయడానికి ప్రాథమికంగా గుర్తించామన్నారు. 122 పోలింగ్ కేంద్రాల పేర్లను మాత్రమే మార్పు చేయడానికి క్షేత్రస్థాయిలో అధికారుల నుంచి ప్రతిపాదనలు అందాయన్నారు. జిల్లాలో నూతనంగా మరొక మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. బాపట్ల, చీరాల, అద్దంకి, పర్చూరు, వేమూరు, రేపల్లె నియోజకవర్గాలలో అధికారుల నుంచి వచ్చిన నివేదికను క్షేత్ర స్థాయిలో పునఃపరిశీలన తదుపరి సమగ్ర నివేదిక రూపొందిస్తామన్నారు. ఈ మార్పుల ప్రతిపాదనలను ఎన్నికల కమిషన్‌కు పంపుతామన్నారు. సమావేశంలో డిఆర్ ఎవిఎస్ఎన్ మూర్తి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణ కాంత్, బిఎస్‌పి కె కోటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, బిజెపి నాయకులు కెవి రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు టి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు షేక్ ఎండి గౌస్ బాషా, వైసిపి నాయకులు వాసుదేవ పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్


మోటివేషనల్ స్పీకర్ సుజాతను సన్మానిస్తున్న వి రామకృష్ణ

సెయింట్ ఆన్స్ విద్యార్థులకు అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి - వేటపాలెం

స్థాయిన సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీ మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థులకు కెరియర్ డెవలవట్ పై అతిథి ఉపన్యాసం నిర్వహించినట్లు కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి తెలిపారు. 2001లో స్థాపించిన తమ కాలేజీ న్యూడిల్లీ ఎఐసిటిఇ గుర్తింపు, కాకినాడ జెఎన్‌టియు శాశ్వత గుర్తింపు పొందినట్లు తెలిపారు. మూడు సార్లు ఎన్‌బిఎ గుర్తింపు, రెండు సార్లు నాక్ 'ఎ' గ్రేడ్ గుర్తింపు కలిగి ఉన్నట్లు తెలిపారు. యుజిసిచే 2(ఎఫ్), 12(బి) ద్వారా గుర్తింపు ఉన్నట్లు తెలిపారు. అటానమస్ కళాశాలగా గుర్తింపు, ఎపి ప్రభుత్వం ద్వారా 'ఏ' గ్రేడ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ శాశ్వత గుర్తింపు, టైమ్స్ ఆఫ్ ఇండియా, సిఇజిఆర్ సంస్థల సర్వేద్వారా భారత దేశంలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో ఒకటిగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. క్రియేటింగ్ ఎ బెటర్ వెర్షన్ ఆఫ్ సెల్ఫ్ అనే అంశంపై గుంటూరు ఆర్‌విఆర్ అండ్ జెసి కళాశాల అధ్యాపకులు, మోటివేషనప్ స్పీకర్, లైఫ్ కోచ్ సుజాత మాట్లాడినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొయిద వేణుగోపాలరావు తెలిపారు. కళాశాల విజన్, మిషన్ ను తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణను పాటించాలని అన్నారు. మొదటి సంవత్సరం ఇన్చార్జి కె అమర్నాథ్ బాబు కో ఆర్డినేటర్ గా వ్యవహరించారు. ఈ సెమినార్‌లో ఆర్ఎస్‌డి ధనలక్ష్మి, సకీనా ఒఫిర్ పాల్గొన్నారు.


గుండెపోటుతో మృతి చెందిన బడి బస్సు డ్రైవర్ ఏడుకొండలు

గుండెపోటుతో బస్సు డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - అద్దంకి

బడి బస్సు నడుపుతుండగా డ్రైవర్‌కు గుండెపోటు వచ్చింది. దీంతో డ్రైవర్ మండలంలోని వెంపరాల గ్రామ సమీపంలో మృతి చెందారు. గత కొన్ని సంవత్సరాలుగా చైతన్య పాఠశాలలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న గుర్రాల ఏడుకొండలు(55) పట్టణంలోని జూనియర్ కళాశాల సమీపంలో నివాసం ఉంటున్నారు. ఎప్పటిలాగానే బుధవారం వెంపరాల రూటులోని గ్రామాల విద్యార్థులను ఎక్కించుకొని పాఠశాలకు వస్తుండగా వెంపరాల సమీపంలో ఏడుకొండలుకు ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో బస్సును మార్జిన్‌లో ఉంచారు. ఈ క్రమంలో విద్యార్థులు ఆందోళన చెంది. ఏమిటి అంకుల్ బస్సులు పక్కన ఉంచారని ప్రశ్నించగా గుండెలో నొప్పిగా ఉందని విద్యార్థులకు చెప్పారు. విద్యార్థులు మంచినీరు తాగించారు. ఆ వెంటనే స్టీరింగ్ పైనే కుప్పకూలిపోయి మృతి చెందారని తెలిపారు. గ్రామస్తులు గమనించి డ్రైవర్‌ను కిందికి దించారు. అధికారులు వచ్చి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. విద్యార్థులను అదే బస్సులో మరో డ్రైవర్ సాయంతో అద్దంకికి చేర్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు ఇంకొల్లు రానున్న ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ బాబు నేడు ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తారని వైద్యాధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు పిహెచ్‌సికి వస్తారని తెలిపారు. రోగుల సౌకర్యాలు, వైద్యసేవల వివరాలను పర్యవేక్షిస్తారని తెలిపారు.

నాసా ఖగోళ శాస్త్రవేత్త హెన్రి ట్రూఫ్‌తో

ఐలవరం విద్యార్థుల ముఖాముఖి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని మైలవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు బుధవారం జూమ్ ద్వారా ప్రముఖ నాసా ఖగోళ శాస్త్రవేత్త హెన్రి ట్రూఫ్ తో ముచ్చటించారు. బాహ్య సౌర వ్యవస్థలో రింగులు, దుమ్ము, ధూళి, గతి శాస్త్రంలో ఆయన నైపుణ్యం కలిగి ఉన్నాడు. ప్రస్తుతం శ్రీలంక పర్యటనలో ఉన్న ఆయనతో పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ ముందుగా అనుమతి పొందిన ప్రకారం పాఠశాల విద్యార్థులతో మాట్లాడించారు. విద్యార్థులు అనేక ప్రశ్నలు, అనుమానాలను అడిగి తెలుసుకున్నారు. వీటిలో అంతరిక్షం ఎందుకు చాలా నిశ్శబ్దంగా ఉంటుంది? సౌర కుటుంబ అవతల జీవం ఉంటుందా? రాత్రిపూట అన్ని నక్షత్రాలను ఎందుకు చూడలేకపోతున్నాం? సైంటిఫిక్ టెంపర్‌ను పెంపొందించుటకు నాసా చేస్తున్న కార్యక్రమాలు ఏమిటి అనే ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మాచర్ల మోహనరావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.


జూమ్ ద్వారా ముఖాముఖిలో పాల్గొన్న విద్యార్థులు


తనిఖీ చేస్తున్న అధికారులు

ఎరువుల దుకాణంపై ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కంభం రూరల్

మండలంలోని తురిమెళ్ళలోని వీరాంజనేయ ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో వ్యవసాయ శాఖ ఏడిఏ రమాదేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. దుకాణంలో సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో రూ.7లక్షల విలువైన స్టాకు విక్రయాలను నిలిపివేయమని ఆదేశించారు. ఎరువులు కొనుగోలు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా బయోమెట్రిక్ వేసి రసీదులు పొందాలని ఆమె రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఏ స్వరూపరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పిటీషన్లు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పొదిలి

అర్జీదారుల్లో సంతృప్తి స్థాయి పెరిగేలా స్పందన పిటీషన్లు పరిష్కరించాలని కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని రథం రోడ్డులోని సాయి బాలాజీ కల్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్జీల పరిష్కారంలో జవాబుదారీతనం పెంచడానికే మండల స్థాయిలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీలలో సహేతుకత ముఖ్యమన్నారు. ఒక సారి వచ్చిన పిటీషను మరలా రాకుండా ఆర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపేందుకు అధికారులు చొరవచూపాలన్నారు. అర్జీలను సకాలంలో పరిష్కరించలేని పక్షంలో అందుకు గల కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రతి బుధ, శుక్రవారాల్లో జిల్లా స్థాయి అధికారులందరూ క్షేత్రస్థాయికి వెళ్లనున్నట్లు వివరించారు. వాటిపరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



స్పందన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్

పంటల నమోదులో పారదర్శకత

ప్రజాశక్తి-పొదిలి

పంట నమోదులో పారదర్శకత పాటిస్తున్నట్లు వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పొదిలి పట్టణంలోని సర్వేనెంబర్ : 107/1 లో రైతు పోతురాజు వెంకటేశ్వర్లుకు చెందిన పోలంలో పంటలను పరిశీలించారు. నమోదు వివరాలు, ప్రస్తుతం ఫీల్డ్ మీద ఉన్న పంటలను సరిచూస్తున్నామన్నారు. సదరు రైతు పొలంలో కంది మరియు సజ్జ, అంతర పంటగా పొగాకు సాగుచేసినట్లు తెలిపారు. కంకిదశలో ఉన్న సజ్జపంటపై శనగపచ్చ పురుగు ఆశించినట్లు తెలిపారు. దీని ప్రభావం దిగుబడిపై చూపుతుందనివెంటనే సస్యరక్షణ చర్యలుచేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎస్‌కె జైనులాబ్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

సర్వసభ్య సమావేశంలో సభ్యుల విన్నపం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండలంలోని అన్ని గ్రామాలలో గత 30 రోజుల నుండి సాగర్ జలాలు రావడంలేదని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం లేదని, నీటి ఎద్దడికి చర్యలు తీసుకోవాలని సర్పంచులు, ఎంపీటీసీలు కోరారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి గాయం సావిత్రి అధ్యక్షతన నిర్వహించారు. సాగర్ జలాలు ఎండిపోయాయని ట్యాంకర్‌లోకి వాటరు రాలేకపోవడం వలన అన్ని గ్రామాలలో సాగర్ జలాలు అందించలేకపోవడం వాస్తవమేనని అధికారులు తెలిపారు. గత మూడు రోజుల నుండి కొన్ని గ్రామాలకు సాగర్ జలాలు రవాణా చేశామని తెలిపారు. మరి కొద్ది రోజులలో అన్ని గ్రామాలకు సాగర జలాలు ఇస్తామని తెలిపారు. లింగంగుంట్ల, హనుమంతపురం గ్రామాలలో వర్షాల సమయంలో కరెంటు స్తంభాలు నేలకొరిగాయని అన్నారు. స్థంభాలు లేకపోవడం వలన లింగంగుంటలో కర్రలతో కరెంట్ లైన్ తీసుకున్నామని తెలిపారు. విద్యుత్ సమస్య పరిష్కరించాలని వైస్ ఎంపీపీ బెంజిమెన్, సచివాలయాల కన్వీనర్ మద్ది తిరుపతయ్య అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ లలిత, సర్పంచ్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ,వైస్ ఎంపీపీ రుద్రపాటి శోభ, ఎంపీటీసీలు నారాయణస్వామి, ఉడుముల సుబ్బారెడ్డి, తాని గుండాల వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచి కత్తి రాజారావు, ఏపిఎం నారాయణరావు, ఎంఇఒ గుర్రం పెద్దిరాజు, చెన్నకేశవులు పాల్గొన్నారు.


సమావేశంలో ఎంపిపి గాయం సావిత్రి

ఉడుముల ఆదిలక్ష్మమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కంభం మాజీ ఎంఎల్‌ఎ శ్రీనివాస్‌రెడ్డి మాతమూర్తి ఉడుముల ఆదిలక్షమ్మ చిత్రపటానికి పూలమాలు వేసే చీరాల ఎంఎల్‌ఎ కరణం బలరామకష్ణమూర్తి, మార్కాపురం ఎంఎల్‌ఎ కుందూరు నాగార్జునరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు, మార్కాపురం మాజీ ఎంఎల్‌ఎ జంకె వెంకటరెడ్డి, పిడిసిసి బ్యాంక్ చైర్మన్వై ఎం ప్రసాద్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.


ఆదిలక్ష్మమ్మకు నివాళి అర్పిస్తున్న బలరాం

కృష్ణారెడ్డి సేవలు మరువలేనివి

సంస్మరణసభలో వక్తలు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

వెలిగండ్ల గ్రామ సర్పంచిగా పాతకోట వెంకట కృష్ణారెడ్డి 40 ఏళ్లపాటు అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. ఎఎంసి మాజీ చైర్మన్, గ్రామ సర్పంచి, చీరాల ఆర్‌డిఒ పి. సరోజిని తండ్రి పాతకోట వెంకట కృష్ణారెడ్డి సంస్మరణ సభ కంభం మాజీ ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డి కుమారుడు గౌతమ్ నాగిరెడ్డి అధ్యక్షతన వెలిగండ్లలో బుధవారం నిర్వహించారు. ఈ సభలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కృష్ణారెడ్డి సేవలు కందుల నాగార్జునరెడ్డి శిష్యుడుగా గుర్తుకు చేసుకున్నారు. పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్‌గా ఈ ప్రాంతంలో ఎంతో మందికి ఉచితంగా నిస్వార్ధంగా సేవలు అందించారని తెలిపారు. ప్రజల కోసమే ఆయన నిరంతరం పాటుపడ్డారన్నారు. కృష్ణారెడ్డి కుమార్తె చీరాల ఆర్‌డిఒ పి. సరోజిని ప్రత్యక్షంగా రాజకీయాలలోకి ఆయన వారసురాలుగా రావాలన్నారు.తొలుత కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలలు వేసి నివాళులర్పించారు. నివాళు లర్పించిన వారిలో వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైసిపి అద్దంకి నియోజక వర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణచైనత్య, దర్శి మాజీ ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నారపశెట్టి పాపారావు, మద్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి, చీరాల మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు,నాయకులు వెన్నా హనుమారెడ్డి, శ్రీనివాసరావు, నారాయణప్రతాప్, గ్రామ సర్పంచి వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.



మౌనం పాటిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

రన్‌వే నిర్మాణం పరిశీలన

శింగరాయకొండ : జాతీయ రహదారిపై నిర్మించిన అత్యవసర రన్‌వేను నేషనల్ హైవే సిబ్బంది, ఎయిర్ ఇండియా కమాండర్స్ బుధవారం తనిఖీ చేశారు. జాతీయ రహదారి పరిధిలోని కందుకూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి కలికివాయి ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకూ అత్యవసర రన్‌వేను నిర్మించారు. ఆ పనుల్లో నాణ్యత లేదని నిలిపివేశారు. త్రివేండ్రం నుంచి ఎయిర్ ఇండియా కమాండర్సు కూనల్ గ్రీమ్ ప్రదీప్ పి లైక్, నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ డివిష్‌గోయల్ కలికివాయి నుంచి కనుమళ్ల వరకూ రన్‌వేను పరిశీలించారు. పనులు పూర్తిస్థాయి నాణ్యతతో జరగలేదని ఎత్తుపల్లాలుగా ఉండటం వల్ల విమానాలు దిగినప్పుడు ఇబ్బందులు ఏర్పాడతాయని గుర్తించారు. కనుమళ్ల రోడ్డు వద్ద పడమర వైపు నుంచి తూర్పు వైపుకు ఉన్న రోడ్డు పూర్తిగా మార్పులు చేయాలని సూచించారు. పూర్తిస్థాయి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని ఎయిర్ ఇండియా కమాండర్స్ తెలిపారు



రన్‌వేను పరిశీలిస్తున్న ఎయిర్ కమాండర్స్

సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి -కనిగిరి

సేంద్రీయ వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం ఎఒలు వి.వెంకట శేషమ్మ, ఎ. శైలజరాణి తెలిపారు. మండల పరిధిలోని తక్కెళ్ళపాడు, తుమ్మగుంట గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లోని రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన మెళకువలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సేంద్రీయ వ్యవసాయం రైతులకు లాభ దాయకంగా ఉంటుందన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పి.వెంకటరెడ్డి, ఐ.చిన్న ఓబులేసు, వెలుగు సిసి కె. శ్రీనివాసులు, విఎఎ బి. వెంకటసుబ్బయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎఒ వెంకట శేషమ్మ

టిడిపి ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం

ప్రజాశక్తి- కనిగిరి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును వ్యతిరేకిస్తూ టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అమరావతి గ్రౌండ్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 8వ రోజుకు చేరాయి. నియోజకవర్గ పరిధిలోని 6 మండలాలకు రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి దీక్షలలో పాల్గొన్నారు. అనంతరం పోస్ట్ కార్డు ఉద్యమానికి డాక్టర్ ఉగ్ర శ్రీకారం చుట్టారు. రాజమండ్రి జైలులో ఉన్న చంద్రబాబుకు పోస్టు కార్డులు పంపారు.ఈ కార్యక్రమంలో ఆరు మండలాల టిడిపి నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

పొన్నలూరు : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా స్థానిక కార్యాలయంలో బిసి సంఘం నాయకులు, రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో బుధవారం నిరసన దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి బీసీ సెల్ ఒంగోలు అధ్యక్షుడు నందికనుమ బ్రహ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతుందని విమర్శించారు. టిడిపి మండల అధ్యక్షుడు అనుమల సాంబశివరావు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైసిపికి ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ దీక్షల్లో బీసీ సంఘం నాయకులు, రైతు సంఘం నాయకులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దర్శి : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జైలు నుంచి విడుదల అయ్యే వరకూ పోరాటం ఆగదని మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు తెలిపారు. చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా కురిచేడు రోడ్డు ఏడో బుధవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షలను మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, టిడిపి మండల అధ్యక్షుడు చిట్టె వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, నాయకులు నెమిలయ్య, మారెళ్ల వెంకటేశ్వర్లు, నారాయణ, నాగరాజు, శ్రీనివాసరావు, సంగా తిరుపతిరావు, శోభారాణి, గాలెయ్య, సందు రామయ్య, వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

శింగరాయకొండ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో బుధవారం రాత్రి తెలుగు మహిళలు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపి ఎమ్మెల్యే డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ, తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కనిగిరిలో దీక్షల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర



దర్శిలో దీక్షల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పాపారావు



తూర్పు నాయుడుపాలెంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న తెలుగు మహిళలు



బహుమతులు అందజేస్తున్న సరితా రెడ్డి

బహుమతులు అందజేత

ప్రజాశక్తి- కనిగిరి

వినాయక చవితి పండుగ సందర్భంగా కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డులో రంపకోత మిల్లు బజార్‌లో వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ విగ్రహం వద్ద కనిగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ వైఎం. సరితా రెడ్డి, 20వ వార్డు కౌన్సిలర్ దీప, వైసిపి నాయకులు కష్ణ, అరుణోదర్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు , పిల్లలకు ఆటలు పోటీలు నిర్వహించారు. విజేతలకు మార్కెట్ యార్డ్ చైర్మన్ సరితారెడ్డి కౌన్సిలర్ దీప చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

కట్టావారిపాలెంలో అన్నదానం


ప్రజాశక్తి-కొండపి

వినాయక చవితి సందర్భంగా కొండపి పంచాయతీలోని కట్టావారిపాలెం తూర్పు బజారులో వైసిపి ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దివంగత రావెళ్ల కోటేశ్వరరావు జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు రాజీవ్ చౌదరి ఆధ్వర్యంలో 1500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి ఆర్.కోటరాజు, సొసైటీ అధ్యక్షుడు బొక్కిసం ఉపేంద్రచౌదరి, వైసిపి నాయకులు బొక్కిసం సుబ్బారావు, రమణయ్య, మామిళ్లపల్లి సింగయ్య, రాజీవ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాలకు నిమజ్జనం

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండల పరిధిలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలను బుధవారం నిమజ్జనానికి తరలించారు. మండలంలోని కె.కొత్తపల్లి, అంభవరం, రేగులచలక, ఐలూరివారిపల్లి, పెద్దగోగులపల్లి, దంతెలపాలెం, జంగంవారిపల్లి వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ప్రజలు ఒకరిపై ఒకరు గులాములు చల్లుకొని సందడి చేశారు. వినాయక చవితి సందర్భంగా ఐలూరివారిపల్లి గ్రామంలో ముత్యాల రమణారెడ్డి కలశాన్ని రూ.12 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. గానుగపెంట మోహన్‌రెడ్డి లడ్డూ ప్రసాదాన్ని రూ.6 లక్షలకు దక్కించుకున్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

వినాయక చవితి సందర్భంగా మండల పరిధిలోని జంగవారిపల్లెలో వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ విగ్రహం వద్ద ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, వైసిపి నాయకులు పాలుగుల్ల మల్లికార్జున రెడ్డి, సిద్దు వెంకటరెడ్డి, సోడా రవి, భువనగిరి వెంకటయ్య, సర్పంచులు రాధాకష్ణారెడ్డి ప్రవీణ్ కుమార్, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చీరాల డిఎస్‌పి ప్రసాదరావు

పెడల్ ఫర్ ఫ్రీడంపై అవగాహన

ప్రజశక్తి - చీరాల

పెడల్ ఫర్ ఫ్రీడంపై అవగాహన అవసరమని షాడోస్ కో ఆర్డినేటర్ రాజా సాల్మన్ అన్నారు. షాడోస్, రెడ్ రోప్, ఆపరేషన్ విముక్తి, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, స్థానిక వైఎ డిగ్రీ కాలేజ్, గర్ల్స్ హై స్కూల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న పెడల్ ఫర్ ఫ్రీడం కార్యక్రమంలో యాక్సెస్ టు జస్టిస్, క్యాంపెయిన్ విముక్తి, జీరో టాలరెన్స్ హ్యూమన్ ట్రాఫికింగ్, ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్మెంట్, అడాల సెంట్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఏడు జిల్లాలలో ఈనెల 20 నుంచి 26 వరకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్ల్స్ హైస్కూల్, వైఎ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. చైల్డ్ అబ్యూజ్ గురించి వివరించారు. రెడ్ రోప్ నుంచి క్రి స్టో లైట్, అడాల సెంట్, చైల్డ్ మ్యారేజ్, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ గురించి వివరించారు. పోస్టర్‌ను డిఎస్‌పి ప్రసాదరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గర్ల్స్ హై స్కూల్ ఇన్చార్జి ప్రిన్సిపల్ బాబు, వైఎ కాలేజ్ ప్రిన్సిపాల్ రమణమ్మ, పిడి లీలా కుమారి, రెడ్ రోప్ ప్రతినిధి క్రిస్టోలిన్, షాడోస్ ఫీల్డ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, కుసుమ, జహీదా పాల్గొన్నారు.


ఇరిగేషన్ కార్యాలయం వద్ద చిట్టివాద రైతుల ధర్నా

సాగునీటి కోసం రైతుల ఆందోళన

ప్రజశక్తి - చీరాల

పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయం ఎదుట చిట్టివాద రైతులు ఆందోళ చేశారు. చిట్టివాద భూములకు వెంటనే నీళ్లు విడుదలచేయాలని నినాదాలు చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ చీరాల దండుబాటు ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న చిట్టివాద పోలాలకు గత కొన్ని నెలలుగా సాగునీరులేక రైతులు అల్లాడిపోతున్నారని అన్నారు. సాగరు కాలువను దృష్టిలో ఉంచుకొని భూముల్లో నారుమడులు వేశామని తెలిపారు. అయితే నెలల గడుస్తున్న చుక్కనీరు కూడా అందకపోవడంతో నేడు నారుమడులు ఎండుకుపోతున్న పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. చిట్టివాద కింద 4వేల ఎకరాల సాగుభూమి ఉందని తెలిపారు. ప్రతి ఏటా జూలై నాటికి నీరు పూర్తిగా అందేదని తెలిపారు. ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యంతో సాగునీరు అందడంలేదని ఆరోపించారు. వెంటనే చిట్టివాద పొలాలకు సాగునీరు అందించకపోతే అన్నదాతలు ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు సుబ్బారావు, బాబూరావు, విమలాకర్, వాసు, జయరత్నం, కృష్ణ పాల్గొన్నారు.


టిడిపి కార్యాలయం వద్ద ధర్నాలో ఎంఎం కొండయ్య

బాబు అరెస్టు దుర్మార్గం

ప్రజాశక్తి - చీరాల

చంద్రబాబు అరెస్టు దుర్మార్గమని టిడిపి ఇంచార్జి ఎంఎం కొండయ్య అన్నారు. బుధవారం స్థానిక కొత్తపేట టిడిపి కార్యాలయంలో రిలే నిరాహార దీక్షలు 7వ రోజు కొనసాగాయి. దీక్షలో ఈపురుపాలెం టిడిపి నాయకులు అందె ఉమామహేశ్వరరావు, అవ్వారు సాంబయ్య, సయ్యద్ ముతహర్, పొట్టేటి పాండురంగారావు, ఆకురాతి ఏడుకొండలు, నందం లావణ్య, కౌతరపు నాగేశ్వరి, కర్నేటి రవి, విన్నకోట జగదీష్, సంబారు రాఘవ, కొప్పు రంగారావు, శీలం దేవరాజ్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి - బాపట్ల

చిరుధాన్యాలతో తయారుచేసిన పదార్థాల ఆహారంతోనే మెరుగైన ఆరోగ్యమని డిఈఓ పివిజే రామారావు అన్నారు. పట్టణంలోని ఏబీఎం హై స్కూల్ ఆవరణలో చిరు ధాన్యాలు పౌష్టికాహారమా! ఆహార వ్యామోహమా! అనే అంశంపై జిల్లా స్థాయిలో విజ్ఞాన సదస్సు బుధవారం ఏర్పాటు చేశారు. సదస్సుకు బాపట్ల జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థుల్లో ఇంకొల్లు మండలం గంగవరం ఎస్‌వికె హై స్కూలు విద్యార్థిని పి అంకిత ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకుందని తెలిపారు. కర్లపాలెం మండలం చింతాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని పి శైలుశ్రీ ద్వితీయ, అద్దంకి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కె షణ్ముఖప్రియ తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని ఈనెల 25న విజయ వాడలో జరిగే రాష్ట్రస్థాయి సదస్సుకు హాజరవుతారని తెలిపారు. పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులను డిఈఓ రామారావు, బాపట్ల ఎంఇఓ నిరంజన్, డి ప్రసాదరావు, జిల్లా సైన్స్ అధికారి ఎండి సాదిక్ అభినందించారు.


విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న డిఇఒ రామారావు

రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు గంగవరం విద్యార్థిని

ప్రజాశక్తి - ఇంకొల్లు

గంగవరం శ్రీ వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠ శాల విద్యార్థిని పెనపల్లి అంకిత జిల్లా స్థాయి లో ప్రథమ బహుమతి సాధించింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. 8వ తరగతి చదువుతున్న అంకితను పాఠశాల హెచ్‌ఎం కె వీరాంజనేయులు, సైన్స్ ఉపాధ్యాయిని ఎం సుమతి అభినందించారు.

ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని ఈపురుపాలెం ఎస్‌కెబీఎస్‌ఎం ఐటిఐ కళాశాలలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. బిసి కమిషన్ సభ్యులు అవ్వారు ముసలయ్య మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డాక్టర్ తాడివలస దేవరాజులు మాట్లాడుతూ నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే అవకాశాలు మన చెంతే ఉంటాయని అన్నారు. నైపుణ్యం, ఉద్యోగం పట్ల అంకితభావం ఉన్న వ్యక్తులు సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతలు పొందుతారని అన్నారు. జాబ్ మేళాలో ఉద్యోగం సంపాదించి, మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించడం వల్ల ఉన్నత స్థానాలు పొందుతారని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎ సత్తార్ మాట్లాడుతూ ఇంటర్వ్యూలో ధైర్యంగా తమ వద్ద ఉన్న నైపుణ్యాలను ప్రదర్శించి ఉద్యోగాలు పొందాలని కోరారు. జాబ్ మేళాలో 4కంపెనీలు పాల్గొనగా 89మంది అభ్యర్థులు హాజరయ్యారు. 59మంది ఉద్యోగాలు సాధించారని ఎపిఎస్-ఎస్‌డిసి ప్రతినిధి అనీష్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ హారిక తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నాదెండ్ల కోటేశ్వరరావు, కొమ్మనబోయిన వీరయ్య, ట్రైబల్ వెల్ఫేర్ ప్రతినిధి దేవరకొండ ప్రవీణ్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్ ప్రతినిధి సౌగంధి, సిఇటిసి ప్రైవేట్ లిమిటెడ్, గ్రీన్ టెక్, డిక్సన్, మాస్టర్ మైండ్స్ కంపెనీ, ఎలా హెచ్ ఆర్ లు పాల్గొన్నారు.



జాబ్ మేళాలో మాట్లాడుతున్న డాక్టర్ తాడివలస దేవరాజు

చెట్టును నరికిన వారిపై కఠినచర్యలు

కొత్తపేట కార్యదర్శి రమేష్ బాబు

ప్రజశక్తి - చీరాల

వందేళ్ల చరిత్ర ఉన్న కొత్తపేట పంచాయతీలోని మర్రిచెట్టును నరికిన వ్యక్తులపై ఉన్నత అధికారులను సంప్రదించి చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. చెట్టు తొలగింపుకు నిరసనగా వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్థులు ఆందోళన చేశారు. వందెళ్లకుపైగా చరిత్ర ఉన్న మర్రిచెట్టను కొందరు స్వలాభం కోసం నరికివేయడం దుర్మర్గమన్నారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే అంతిమ క్రతువును ఈ చెట్టువద్దే నిర్వహించడం ఆనవాయితీగా పాటిస్తున్నారని తెలిపారు. అక్కడ ఉన్న భూములను అమ్ముకునేందుకు చెట్టు అడ్డమైందనే నెపంతో కొందరు బలమైన నేతల అండతో చెట్టును కొట్టేశారని ఆరోపించారు. చెట్టును నరికే సమయంలో అడ్డుకునే ప్రయత్నం చేసిన మహిళలపై కూడా దాడులకు పాల్పడ్డారని తెలిపారు. ఈ విషయమై పంచాయితీ సెక్రటరీ రమేష్ బాబు మాట్లాడుతూ చెట్టు నరేందుకు పంచాయతీ అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. గ్రామస్థుల తమ దృష్టికి తీసుకురావడంతో చెట్టు నరికిన వారిపై పోలీసు కేసు కూడా నమోదు చేశామన్నారు.


కార్యదర్శి రమేష్‌బాబుకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఏకాభిప్రాయంతో ముగిసిన కౌన్సిల్

- 4 అంశాలు రద్దు - ఒకటి వాయిదా

ప్రజశక్తి - చీరాల

మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలో 37అంశాలు పొందుపర్చారు. అందులో 4 అంశాలను రద్దు చేశారు. ఒక అంశాన్ని వాయిదా వేశారు. సమావేశంలో పలువరు కౌన్సిలర్లు సమస్యలపై ప్రశ్నల వర్షం కురింపించారు. చీరాల పట్టణంలో అభివృద్ధి జరగాల్సిన అంశాలపై దృష్టిపెట్టాలని కౌన్సిలర్లు ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అయితే 30నిమిషాల వ్యవధిలోనే సమావేశం ముగిసింది. కార్యక్రమంలో కమిషనర్ రామచంద్రారెడ్డి, టిపిఎస్ లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు


వరి పొలాన్ని పరిశీలిస్తున్న మోహనరావు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పంట పొలాలకు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని డిఎల్ ఎం మోహనరావు సూచించారు. రసాయన ఎరువులు, పురుగు మందులకు బదులు ప్రకృతిలో లభించే ఆకులు, కాయల తో కషాయం తయారు చేసుకుని పిచ్చికారి చేసుకోవాలని సూచించారు. మండలంలోని ఐలవరం, కోనేటిపురం గ్రామాలలో వరి పొలాలలో పరిశీలించారు. ఆకు ముడత, నాము తెగులు ఉన్నట్లుగా గుర్తించారు. దీని నివారణకు పేడ, మూత్రం, ఇంగువ, ద్రావణం దశపరచిన కషాయంలో పిచికారీ చేయాలని అన్నారు. క్యాడర్ కంపాక్ట్ బాక్స్‌లో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంటి బాల, పాప, ఝాన్సీ, రాణి, సురేష్, సిఆర్ పి పాండురంగారావు ఉన్నారు.


ఎంపిపికి రుణ దరకాస్తు అందజేస్తున్న దృశ్యం

విశ్వకర్మ యోజనకు నమోదు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రధాని విశ్వకర్మ యోజన పథకంకు లబ్ధిదారులు కామన్ సర్వీస్ సెంటర్ (సిఎస్‌సి)లో నమోదు చేసుకోవాలని ఎంపీపీ డివి లలిత కుమారి తెలిపారు. వేమూరు కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షులు కోడూరు వెంకటేశ్వరరావు కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేసుకోగా అందిన వివరాలను ఎంపీపీ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కామన్ సర్వీస్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. చేతివృత్తుల వారు ఈ పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మ చంద్రశేఖర్, ఏవో శైలజ, నాయకులు మల్లేశ్వరరావు ఉన్నారు.


గణేష్ ఉత్సవాల్లోనృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన నృత్య ప్రదర్శన

ప్రజశక్తి - చీరాల

పట్టణంలోని బెస్తపాలెం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మందిరం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. చిన్నారులు కూచిపూడి నృత్యం, భరతనాట్యం చేశారు. అబ్బుర పరిచే ఘట్టాలను చిన్నారులు ప్రదర్శిస్తూ తమ ప్రతిభానైపుణ్యాన్ని వేధికముందున్న వీక్షకులకు కనువిందు చేశాయి. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ బెస్తపాలెం యూత్, గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 16ఏళ్లగా గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నామన్నారు. దాతల సహకారంతో ఎంతో వైభవంగా ప్రతిరోజు పూజా కార్యక్రమాలు జరుపుతామని చెప్పారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీచేశారు.

కుట్రతోనే చంద్రబాబు అరెస్ట్

- కొనసాగుతున్న నిరసన దీక్షలు
- మార్టూరులో మహిళల దీక్ష
- కారంచేడులో పోస్టుకార్డు ఉద్యమం
- భట్టిప్రోలులో పాల్గొన్న ఆనందబాబు



చుండూరు దీక్షలో నక్కా ఆనందబాబు



చీరాల దీక్షలో ఎంఎం కొండయ్య



కారంచేడులో పోస్టు కార్డు ఉద్యమం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రాజకీయ కుట్రతోనే చంద్రబాబును అరెస్ట్ చేశారని తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు ఉప్పుటూరి రమాదేవి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షల్లో ఆమె మాట్లాడారు. స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తే అవినీతి జరిగిందని తప్పుడు ఆరోపణలు చేస్తూ అరెస్ట్ చేయడం దుర్మార్గమని అన్నారు. యువతకు ఉద్యోగాలు ఇప్పించడమే చంద్రబాబు చేసిన నేరమా అని ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్‌లో చంద్రబాబు పేరు లేనప్పటికీ రాజకీయ కుట్రలో భాగంగానే రిమాండుకు పంపించారని ఆరోపించారు. వైసిపి చేస్తున్న అరాచకాలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో మండలపు ఆదిలక్ష్మి, అనుమోలు కస్తూరి, కోకా ఉమా, గంగాధర రత్నకుమారి, షేక్ ముంతాజ్ బేగం పాల్గొన్నారు.

రేపల్లె : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో టిడిపి చేపట్టిన సామూహిక నిరాహార దీక్షలు 8వ రోజుకు చేరాయి. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నల్ల రిబ్బన్లు కట్టుకుని నినాదాలు చేశారు. చంద్రబాబుకు మద్దత్తుగా సంతకాల సేకరణ చేశారు. అనగాని శివప్రసాద్, జివి నాగేశ్వరరావు మాట్లాడారు. చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికమని అన్నారు. రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోందని అన్నారు. జగన్ కుట్రలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కలిగించాలని అన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి మేకా శివరామకృష్ణ, పంతాన్ని సాయికుమార్, కుదరవల్లి వెంకటేశ్వరరావు, నల్లూరి అజయ్, తాడిపత్రి మల్లికార్జునరావు, పివి చింతారావు, నేత్ర నాగేంద్ర బాబు, డొక్కు వెంకటేశ్వరరావు, కామరాజు గడ్డ నాగశ్రీ, దేవగిరి రవికుమార్, రేపల్లె రామాంజనేయులు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

కారంచేడు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా కారంచేడు నుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు రాజమండ్రి సెంట్రల్ జైలుకు పోస్టు కార్డులు రాశారు. 200మంది పోస్టు కార్డులు చంద్రబాబుకు మద్దతుగా జైలు అధికారులకు పోస్టు కార్డులు రాశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో 12వ రోజు నిరసనలో మాజీ ఎంపిపి, మాజీ ఎఎంసి చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేశారు. దీక్షల్లో టిడిపి కార్యకర్తలు కంభంపాటి నరేంద్ర, పాతూరి ఆదిలక్ష్మి, పోతిన వెంకటేశ్వర్లు, కొల్లా భాస్కరరావు, తాళ్లూరి అనిల్ కుమార్, రామచంద్రరావు, యార్లగడ్డ సాయి కృష్ణ పాల్గొన్నారు.

పర్చూరు : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ దీక్ష చేశారు. దీక్షలో బాపట్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీను, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఇండ్ల శ్రీనివాసరావు, బాలిగ శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీనివాసరావు, యద్దనపూడి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలపర్తి వీరస్వామి, కారంచేడు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పునరుసు వెంకటేశ్వర్లు, పార్లమెంట్ ఎస్సీ సెల్ కార్యదర్శి యండీటి కోటేశ్వరరావు, అద్దూరి వెంకటేశ్వర్లు, కోట నాయక్, రాచూరి కుమార్ పాల్గొన్నారు.

అద్దంకి : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రిలే నిరాహార దీక్షలు 8వ రోజు నిర్వహించారు. దీక్షలో కాకానిపాలెం మహిళలు, మాజీ జెడ్పిటిసి సింగ్ సుబ్బాయమ్మ, అద్దంకి మాజీ సర్పంచ్ పొడపాటి విజయలక్ష్మి, నందమూరి కళాపరిషత్ అధ్యక్షుల మన్నం త్రిమూర్తులు, కాకాని అశోక్, బెజవాడ రామారావు, చేబ్రోలు సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, శేఖర్, జిలాని పాల్గొన్నారు.

భట్టిప్రోలు : చుండూరులో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో 8వ రోజు నిరాహార దీక్ష చేశారు. దీక్షలో మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్క ఆనందబాబు మాట్లాడారు. మరో ఆరునెలల్లో టిడిపి అధికారానికి వస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మైనేని మురళీకృష్ణ, కనగాల మధుసూదన్ ప్రసాద్, జొన్నలగడ్డ విజయబాబు, తూనుగుంట్ల సాయిబాబా, ఒక శేషుబాబు, వేములపల్లి జగన్నాధరావు, బట్టు మల్లికార్జునరావు, సిరాజ్, జయశీలరావు పాల్గొన్నారు.

శిరోముండనం చేసుకొని నిరసన

ప్రజాశక్తి - బాపట్ల

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో రిలేనిరాహార దీక్షలు చేశారు. ఈసందర్భంగా ఎస్సి సెల్ బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయబాబు శిరోముండనం చేసుకొని నిరసన వ్యక్తం చేశారు.



శిరోముండనం చేయించుకుని నిరసన



వైద్యపరీక్షలు చేస్తున్న కిమ్స్ వైద్యులు

కిమ్స్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మండలంలోని ఇడుపులపాడులో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలో ప్రసిద్దిగాంచిన తమ హాస్పిటల్ ఎంతో మందికి సేవలందిస్తుందని హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. రెవరన్ జి సంజయ్ కుమార్, ఇడుపులపాడు పెద్దలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూత్ సహకారంతో లూధరన్ చర్చి ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 225మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. గుండె, కిడ్నీ, విష జ్వరాలు వంటి వ్యాధులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రోగ నిర్ధారణ జరిగిన 45మంది పేషంట్లకు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామని తెలిపారు. క్యాంపులో డాక్టర్ వినీల్, ఆప్తమాలజిస్ట్ రాణి పాల్గొన్నారు.



కాలువల్లో చెత్త, మురుగు తొలగిస్తున్న పంచాయితీ సిబ్బంది

పిచ్చి మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి - పంగులూరు

గత కొంతకాలంగా గ్రామంలో పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేయించలేదు. దీంతో దళిత కాలనీలో సైడ్ కాలువలు మురుగుతో నిండిపోయాయి. రోడ్డకిరువైపులా పిచ్చి మొక్కలు మొలిచాయి. దోమలు, ఈగలు చేరుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పంగులూరు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు బుధవారం దళిత కాలనీల్లోని సైడ్ కాలవలో మురుగు తీశారు. కాలువ పక్కనున్న పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రస్తుతం వర్షాలు లేకపోవడం వలన సమస్య ఎదురు కాలేదు. కానీ వర్షాలు కురుస్తున్నట్లయితే మురుగంత రోడ్డ మీదకు వచ్చేదని గ్రామస్తులు అంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు కూడా ఉన్నందువల్ల పిచ్చి మొక్కలను తొలగించి మురుగును తొలగించడం మంచి పని అని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుడిపూడి నాగేంద్రమ్మ రామారావు, సెక్రెటరీ ఎల్ సునీతకు అభినందనలు తెలిపారు.



వైద్యశాల అభివృద్ధి కమిటీలో ఎంపిపి

గైర్హాజరవుతున్న వైద్యునిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం పిహెచ్‌సిలో బుధవారం జరిగింది. అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంపిపి డివి లలిత కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైద్యశాల రెండవ వైద్యులు శ్రీనివాసరావు నిరంతరం గైన్ గైర్హాజరవుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలం అంటూ వ్యాధులు ప్రబలే సమయంలో గైర్హాజరైతే రోగులు ఇబ్బందులు పడతారని తెలిపారు. తక్షణమే ఇతనిపై చర్యలు తీసుకోవాలంటూ బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. వైద్యశాలకు అవసరమైన కొన్ని రకాల సౌకర్యాల ఏర్పాటుకు పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ వైద్యులు డివల్ పద్మజ, కమిటీ సభ్యులు తాసిల్దార్ డి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖర్, భట్టిప్రోలు సర్పంచి దారా రవికరణ్బయి, సూరేపల్లి సర్పంచ్ మార్ల విజయలక్ష్మి, జడ్పిటిసి ఉదయభాస్కరి, నాయకులు మల్లేశ్వరరావు, బాలాజీ ఉన్నారు.

పెయ్య దూడల ఉత్పత్తిని సద్వినియోగం చేసుకోవాలి

పశు వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్



పెయ్యిదూడల పథకంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రవీణ్

ప్రజాశక్తి - రేపల్లె

పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని తుమ్మల గ్రామ పశు వైద్యాధికారి డాక్టర్ ఎ ప్రవీణ్ కుమార్ తెలిపారు. రాష్ట్ర పశు గణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ ప్రవేశపెట్టిన రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన పెయ్యల ఉత్పత్తి పథకం పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రీన్ రెవెల్యూషన్ తరహాలో మిల్క్ రెవెల్యూషన్ రావాలన్నారు. పాడి పశువులను ఆదరించి పాల ఉత్పత్తులు పెంచాలన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ అందిస్తున్న కృత్రిమ గర్భోత్పత్తి ఇంజక్షన్‌లను యదకు వచ్చిన పశువులకు ఇచ్చి నట్లయిన 90శాతం వరకు ఆడ దూడలు పుట్టే అవకాశం ఉందన్నారు. దీని కోసం వాడే ఇంజక్షన్ ఖరీదు రూ.1350కాగా రైతులు రూ.500 చెల్లిస్తే సరిపోతుందన్నారు. రైతు గరికపాటి రమేష్ గేదకు లింగ నిర్ధారిత వీర్యం పెయ్యాదూడల సెమెన్ చేయగా మొట్టమొదటిగా నియోజకవర్గంలో దూడ జన్మించిందని అన్నారు. పాడి పశువుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ 108తరహాలో పశువుల కోసం 1962టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసిందన్నారు. పశువులు అనారోగ్యానికి గురైతే 1962 నెంబర్‌కు కాల్ చేస్తే అంబులెన్స్‌తో ఆ రైతు చెప్పిన స్థలానికి డాక్టర్స్ వచ్చి తగిన వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గరికపాటి భానుకోటి, సచివాలయ కన్వీనర్ దేవరకొండ అనిల్, సర్పంచ్ దీపిక సురేష్, వార్డు మెంబెర్ గాదె మణీంద్ర, గోపాలమిత్ర శివ కృష్ణ పాల్గొన్నారు.

రేషన్ వాహనదారులకు బీమా చెల్లించాలి



తహశీల్దారు వెంకటేశ్వరరావు అర్జీ ఇస్తున్న రేషన్ బండి డ్రైవర్లు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

చౌక ధరల దుకాణాలలో రేషన్ పంపిణీ వాహనదారుల బీమాను ప్రభుత్వ చెల్లించాల్సి ఉండగా ఆరు నెలలుగా చెల్లించకపోవడంతో బ్యాంకర్లు తమకు అందాల్సిన వేతనాన్ని జమ చేసుకుంటున్నారని వాహన డ్రైవర్లు తహశీల్దారు వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. దీనివలన తాము ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రేషన్ లబ్ధిదారుల నుండి రెండు విడతలుగా వేలిముద్రలు తీసుకోవడం వల్ల సమయాభావం కలుగుతుందని తెలిపారు. దీనికి తోడు లబ్ధిదారులు అసహనానికి గురై భౌతిక దాడులకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీమా సొమ్మును బ్యాంకులకు ప్రభుత్వమే చెల్లించాల్సి ఉండగా నిధులు విడుదల చేయకపోవడంతో తమకు అందాల్సిన అరకొర వేతనం బ్యాంకర్లు జమ చేసుకుంటే తామేమి తినాలని వాపోయారు. ప్రతినెలా 1న వేతనం జమ అయ్యే విధంగా చూడాలని కోరారు.



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఎంపిటిసి గోపాల్‌రెడ్డి

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటారని గంగవరం ఎంపిటిసి మేకల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గంగవరంలో బుధవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. చిన్నారుల కోసం అంగనవాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందని సర్పంచ్ బెల్లం సుధాకర్ తెలిపారు. చిన్నారులంతా పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. సభకు సెక్టారు సూపర్‌వైజర్ కె వాణి అధ్యక్షత వహించారు.



మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

నీటి వనరుల వినియోగంలో ... ప్రభుత్వాలు విఫలం

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-పామూరు

జిల్లాలో నీటి వనరులు ఉన్నప్పటికీ వాటిని వినియోగించు కోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ విమర్శించారు. స్థానిక పప్పు ఎంకోబురావు మీటింగు హాలులో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో హనీఫ్ మాట్లాడారు. ప్రకాశాన్ని వెనుకబడిన జిల్లాగా గుర్తించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. 55 శాతం నీరు సముద్రం పాలు అవుతుందని, అందుకు పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. నీటిని వ్యాపారంగా మార్చి పేదలకు అమ్ముకుని జేబులు నింపుకుంటున్నారన్నారు. పాలకుల స్వార్థం వల్ల యువత ఉపాధి కోల్పోయి ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నట్లు తెలిపారు. జిల్లా ఏర్పడి 75 సంవత్సరాలైనా నేటికీ జిల్లా అభివృద్ధి శూన్యమన్నారు. రాజకీయ నాయకులు పదవులు అనుభవిస్తున్నారే తప్ప ప్రజా సమస్యలు పట్టించు కోవడం లేదని ఆరోపించారు. ప్రజలు ఐక్యమై పెండింగ్ ప్రాజెక్టు పూర్తి అయ్యేంతవరకూ పోరాడి సాధించు కోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 23న జిల్లాకలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో తాగునీరు, సాగునీరు కోసం రూ. 600 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.పైపులైన్లు వేసి ఇతర పనులు మరిచిపోయారన్నారు. పిసిపల్లి మండలంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్య రంగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు.గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టా లన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు వీర నారాయణ, గౌస్‌బాషా, అల్లాభక్షు, శంకర్, చల్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ వినతి పత్రం అందజేస్తున్న గౌస్

పాఠశాల ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండల పరిధిలోని అటవీప్రాంత గ్రామమైన మైలుచర్లలో పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం పొదిలిలో నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో ఎంఇఒ-2 రాజాల కొండారెడ్డి, మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ షేక్ గౌస్ కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైలుచర్ల గ్రామంలో 20 మంది విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడినట్లు తెలిపారు. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మైలుచర్ల గ్రామంలో పాఠశాల మంజూరుకు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. విద్యాశాఖ అధికారులకు స్కూల్ మంజూరు కోసం నివేదిక పంపాలని కలెక్టర్ ఆదేశాల జారీ చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పేద పిల్లల విద్యాభివద్ధి కషి చేస్తున్న డాక్టర్ షేక్ గౌస్‌ను కలెక్టర్ దినేష్ కుమార్ సత్కరించారు.

మా భూములను ఆక్రమించారు

- పాదయాత్ర బృందం ఎదుట సమస్యల ఏకరువు
- సంతనూలతలపాడులోకి పాదయాత్ర ప్రవేశం



మాట్లాడుతున్న జివి. కొండారెడ్డి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

పెత్తందారులు తమ భూములను ఆక్రమించారని, కనీసం ఆ భూముల్లోకి రానివ్వడం లేదని పలు గ్రామాల ప్రజలు సిపిఎం పాదయాత్ర బృందం ఎదుట తమ గోడును చెప్పుకున్నారు. ప్రకాశం జిల్లా అభివద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని, జిల్లాను వెనుకబడిన జిల్లా జాబితాలో చేర్చాలని, జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరుతూ కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట-పాదయాత్ర బుధవారం సంతనూతలపాడు నియోజకవర్గం లోకి ప్రవేశించింది. మద్దులూరు, మాచవరం ,చిలకపాడు, తక్కెళ్ళపాడు, గంగవరం గ్రామాల్లో పాదయాత్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యల్ని పాదయాత్ర బందం దష్టికి తీసుకొచ్చారు. మద్దులూరులో పేదలకు సాగుభూములకు పట్టాలు ఇచ్చారని, హద్దులు చూపలేదని గ్రామస్తులు తెలిపారు. సమస్యను తహాశీల్దారు దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని తెలిపారు. పెత్తందారులు ఆక్రమించుకొని తమను భూముల్లోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని పాదయాత్ర బందం దష్టికి తీసుకొచ్చారు. అనేక సంవత్సరాల నుంచి చెరువు పోరంబోకు భూమిని సాగు చేసుకుని జీవిస్తున్నామని, తమకు ఎలాంటి హక్కులు లేవని హక్కులు కల్పించాలని కోరారు. కారుమంచి మేజరు కాలువకు మరమ్మతులు చేసి సాగు, తాగునీరు అందించాలన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, పాదయాత్ర బంద నాయకుడు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన భూముల్లో వారే సాగుచేసుకునేందుకు సిపిఎం అండగా ఉంటుందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు జిల్లా వెనుకబాటు, అభివద్ధికి అవసరమైన నిధుల గురించి శాసనసభలో చర్చించి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివద్ధి కావాలంటే వెలిగొండ ప్రాజెక్టు, సంతనూతలపాడు నియోజకవర్గంలోని రామతీర్థం, గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు రిపేరు చేయించాలన్నారు. పాదయాత్రలో కంకణాల ఆంజనేయులు, వెల్లంపల్లి ఆంజనేయులు, కె.రమాదేవి, పి.కల్పన, వి. బాలకోటయ్య, వినోద్, బి.రఘురాం, కె.మాల్యాద్రి, రఫీ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ మాబు, సంతనూతలపాడు మండల కార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు ఎ.శేషారావు, బి.పద్మ, మాలతి, షేక్ మస్తాన్, అబ్బూరి, వెంకటేశ్వర్లు, కె.హనుమంతరావు పాల్గొన్నారు.

'ముసి'కి సాగర్ నీరు విడుదల చేయాలి


- రేగలగడ్డపాలెంకు బస్సు సౌకర్యం కల్పించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి. కొండారెడ్డి



పాదయాత్రలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కొండపి

ముసి నది పరివాహన ప్రాంతంలో 45 గ్రామాలు ఉన్నాయని, ఆయా గ్రామాల ప్రజలు తమ సొంత నిధుల వెచ్చించి లిఫ్ట ఇరిగేషన్ ద్వారా పంటలు పండిచుకుంటున్నారని, ముసిలో నీరు లేక పోవడంతో పంటలు పండక రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు సిపిఎం పోరుబాట-పాదయాత్ర బృంద సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో ముసి నదికి 1 టిఎంసి సాగర్ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ప్రకాశాన్ని వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చి జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు ప్రత్యేక ప్యాకేజిని ప్రటించాలని, ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట-పాదయాత్ర బృందం 11వ రోజు బుధవారం మండల పరిధిలోని పెరిదేపి రేగలగడ్డపాలెం, అనకర్లపూడి గ్రామాలలో పర్యటించింది. తొలుత పెరిదేపి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం కామ్రేడ్ ముప్పరాజ శేషయ్య స్థూపం వద్ద శేషయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా పాదయాత్ర బృందం నాయకుడు జివి. కొండారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 80 శాతం పటలు వర్షాధారంగా పండుతాయని తెలిపారు. అయితే నైరుతీ,ఈశాన్య రుతు పవనాలు జిల్లా అంచు వరకూ వచ్చి ఆగిపోతున్నాయన్నారు. జిల్లాలోని 30 మండలాల్లో కరువు, అతివృష్టి తాండ విస్తుందన్నారు. జిల్లాలో వర్షాలు పడినప్పుడు 55 టిఎంసిల నీరు వృథాగా సముద్రంలో కలుస్తుందన్నారు. పెరిదేపిలో ఎస్‌కాలనీ నుంచి పంచాయతీ కార్యాలయం వరకూ సైడు కాలువలు నిర్మించాలని, బీసీ కాలనీలో సిసి రోడ్లు, సైడు కాలువలు నిర్మించాలని, పెరిదేపి బస్టాండ్ సెంటర్ నుంచి రేగలగడ్డపాలెం వరకూ తారు రోడ్డు నిర్మించాలని, కొండపిలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, ఒక టిఎంసి సాగర్ నీటిని దశల వారీగా ముసి నదికి విడుదల చేయాలని పెరిదేపి గ్రామస్తులు పాదయాత్ర బృందానికి అర్జీ అందజేశారు. జరిగిందన్నారు. రేగలగడ్డపాలెంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, డ్రైనేజి, బస్సు సౌకర్యం కల్పించాలని, అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని గ్రామస్తులు అర్జీలు అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ముసి నదిలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించాలన్నారు. ఒక టిఎంసి సాగర్ నీటిని విడుదల చేయాలన్నారు. తద్వారా వేలాది ఎకరాలు సాగు చేసుకోవచ్చునని, లక్షల మందికి తాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని సిపిఎం తరపున ఆయన డిమాండ్ చేశారు. గతంలో వర్షాలు లేక ముసి నది ఎండిపోయినట్లు తెలిపారు. ముసి నదికి సాగర్ నీటిని వదలాలని వ్యవసాయ, రైతు సంఘాలు పెద్ద ఎత్తున పోరాటం చేసినట్లు తెలిపారు. స్పందించిన ప్రభుత్వం వెంటనే వెలుగువారిపాలెం నుంచి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. పాదయాత్రలో వి. బాలకోటయ్య, బి.రఘురాం, కె.రమాదేవి, పి.కల్పన, కె. మాల్యాద్రి, సిహెచ్.వినోద్, వి.ఆంజనేయులు, డికెఎం. రఫీ, సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ , సిపిఎం జిల్లా నాయకులు ఎం. రమేష్, కాలం సుబ్బారావు, టి.తిరుపతయ్య పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సిపిఎం బృందం

సమాజ వినాశనానికి కారణమవుతున్న పారిశ్రామిక అభివృద్ధిని వ్యతిరేకిస్తాం : సిపిఎం

సమాజ వినాశనానికి కారణమవుతున్న పారిశ్రామిక అభివృద్ధిని వ్యతిరేకిస్తున్నట్లు సిపిఎం పోరుబాట పాదయాత్ర బృందం నాయకులు జివి.కొండారెడ్డి తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట - పాదయాత్ర కొండపి మండలంలోని అనకర్లపూడి నుంచి సంతనూతలపాడు మండలం మద్దులూరు గ్రామంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా అనకర్లపూడి-మద్దులూరు గ్రామాల మధ్యలోనున్న మున్నంగి సీఫుడ్స్ నుంచి వెలువడే వ్యర్థాలను ముసినదిలో కలుపు తున్నారని, దీంతో పంటలు దెబ్బతిని, ఆరోగ్య సమస్యలు వస్తున్నట్లు పెరిదేపి, ముప్పరాజుపాలెం, రేగలగడ్డపాలెం, అనకర్లపూడి గ్రామల రైతులు, గ్రామస్తులు పోరుబాట పాదయాత్ర దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ పెరిదేపి - ముప్పరాజు పాలెం గ్రామాల మధ్య సాగు చేసిన పొగనారు మడులకు ముసినది నీరు పెట్టడంతో నారు మడులు రంగు మారినట్లు తెలిపారు. ఆక్వా ప్రాసెస్ యూనిట్ నుంచి వచ్చే వేస్టు వాటర్ ఎటుపెడుతున్నారో అర్థం కావడంలేదన్నారు. పరిశ్రమలు, కార్మికులు ఉండాలని, ప్రజలకు విఘాతం కల్పించే పారిశ్రామిక అభివృద్ధిని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. తహాశీల్దారు ఆధ్వర్యంలో జలవనరుల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు సీఫుట్స్ నుంచి వచ్చే వేస్టు వాటర్ శ్యాంపిల్స్ ,రైతులు వినియోగించే నీటి శ్యాంపిల్స్ తీసి సమగ్రమైన నివేదికను తయారు చేయాలన్నారు. కలుషితం అవుతున్నట్లు గుర్తిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.